సో: నాకు తెలియందేమీ లేదులే!

పే: అన్నయ్యకోసం అన్నయ్య కొడుకు కోసం, మనకోసం మన పిల్లలకోసం, అం...

సో: మనకింకా పిల్లలు లేరులే!

పే: ఉన్నారు. దిక్కులేని పిల్లలంతా మన పిల్లలే. అందులో నాకిప్పుడు నెల... (సిగ్గు పడుతుంది.)

సో: (పిడుగు బడ్డట్టయి) నెల తప్పిందీ! కొంపార్చావు పేరిందేవీ! కొంప నిలువునా ఆర్చావు. ఇందాకట్నుంచీ మన భీముగాడు యేదోసోదిచెబుతున్నట్లు చెప్పూతుంటే ఏమిటో ననుకున్నాను.

పే: ఆరోగ్యకరంగా జీవించడానికి యీ యిల్లు యిల్లా యిది? మురికికూపం. ఇది చాలదు. వచ్చే జీతంవల్ల సంసారం నడవదు. బ్రతకడానికి కావాల్సిన సర్వ వసతుల కోసం మనం గట్టిగా అడగవలసిందే! శాయ శక్తులా పోరాడవలసిందే; మనం అంతా కుల, మత, లైంగిక భేదం లేకుండా సుసంఘటితులం కావల్సిందే. పదండి!

సో: పోదాం పేరిందేవీ పోదాం. అసలు విషయం యేమంటే...

రా: అపరా యీ విషయాలు యిహ! వస బోసిన పిట్టలాగ యింట్లో కూర్చొని నువ్వా నీ వాగుడున్నూ. రాండి పోదాం.

భీ: పదండి. అసలే ఆలస్యమయింది.

(అందరూ కలిసి వెళ్లి ప్రదర్శనంలో కలుస్తారు)

కథానిక

# నమ్మి చెడిన వాడు

పెనుమర్తి కామేశ్వరరావు

షూటింగుకు స్టూడియోకు వెళ్ళడానికింకా గంట టైముంది. ఆ రోజున టాకీలోకల్లా ముఖ్యమైన ఘట్టం షూటింగు జరగవలసి వుంది. ఆమె ఉదయం ఎనిమిది గంటలనుంచీ 9 గంటల వరకూ టాయిలెట్టులో, వస్త్ర ధారణలో లీనమైంది. నిలువు టద్దానికెదురుగా నిలబడి తనకున్న పట్టుచీరెలలో జాకెట్లలో కల్లా మంచి అందమైన వాటిని తన శరీర కాంతితో మేళవించే శబలిత వస్త్రములను నిర్ధారణ చేసుకోవడంలోనే అరగంట వ్యర్థమైంది. పెట్టెలోని బట్టలన్నీ ఇస్త్రీ షాపులో వలె కుప్పగా పోసింది. ఒక్కటొక్కటే తీసి అద్దానికెదురుగా నిలబడి చీరెని తన భుజం మీద వేసికొని మనసు తృప్తి పరుచుకోవడానికి ప్రయత్నించింది. ఇంటి వద్దనుంచి ఎంత అందంగా సింగారించుకొనిస్టూడియోకు వెళ్ళినా అక్కడ తన సున్నదాన్ని వున్నట్లుగా నటించనీయక తనకు క్రొత్తగా టాకీలో తన పాత్ర కనుగుణంగా మేకప్ చేస్తారు. ఆమె తన శ్రమనంతా వృథా అనుకోలేదు. ఇంటివద్ద తనుచేసుకునే ముస్తాబు సినిమాకు పనికి రాకపోయినా, సినిమాకు సంబంధించిన వ్యక్తుల్ని ఆకర్షించడానికి ఎంతైనా ఉపకరిస్తుంది. దర్శకుడు తన వాడేగాని—ఫొటోగ్రాఫర్, సౌండ్ ఇంజనీర్, మేకప్‌మాన్, కవి, సంగీత దర్శకుడు— వీళ్లంతా ఎంతమందో తననభిమానిస్తేనే తనకు విజయం లభించేది. అందులో దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో అనుభవం లేకుండా ఆ పని కుద్యుక్తుడైనాడు. అతడు ప్రతివిషయంలో తక్కిన వాళ్ళమీద ఆధారపడి వుండటం తనకు తెలుసు. తనను ప్రేమించి సుకుమార్ - అనుభవం, జ్ఞానంలేని తనచేత ఆ టాకీలో నాయిక వేయిస్తున్నాడు.

నిలువుటద్దంలో తన శరీరాన్ని చూచుకున్నప్పుడల్లా నిర్మల తాను జగదేక సుందరి ననుకోవడంలో తప్పేమీలేదు. ఆమె నిజముగా సౌందర్య ఖనియే కాని సినిమారంగంలో అనుభవం లేదు. వివిధ భావాల్ని ప్రకటించడంలో ఆమెకు సమయస్ఫూర్తి చాలా తక్కువ. శ్రీనాథుడు కాశీ ఖండంలో ఆటవిక సేనాధీశు సీమంతినుల్ని వర్ణిస్తూ, "వ్యామగ్రాహ్య పయోధరల్, కుటిల నీలాగ్రాలకల్, తథ్య మిథ్యా మధ్యస్థిత మధ్య"లన్నాడు. నిర్మల కూడా ఆటవిక సుందరియే. ఏ కులంలో ఏపూళ్ళో జన్మించిందో, ఏ తలిదండ్రులకు జన్మించిందో కాని—ఆమె శరీరం మిసమిసలాడుతూ, మాంజిష్ఠ

వర్ణంలో, పరిపుష్టంగా, నిండుగా ప్రేక్షకుల కనుల పండువుగా, అపర రంభా సౌందర్యవతిగా-రతిగా కాముకుల మతి కలంచుతుంది. ఆమె యౌవనం కేవలం పడకటింటి పందిరి మంచంలో మ్లానమొందుట కళకు అపకృతియని భావించి సుకుమార్ ఆ ఆటవిక సుందరిని టాకీలో నాయికి పాత్రగా నటింప జేయాలని ఒక సినిమా కంపెనీని స్థాపించి నానా అవస్థలూ పడి ధనం సేకరించి-నిర్మల నిస్తుల శోభా ప్రాభవాదరంతో అమిత లాభం గడిద్దామని టాకీ తీస్తున్నాడు.

టాకీలో సగభాగం షూటింగు అయిపోయింది. ఆనాడు చంద్రకాంత శిలావేదికపైన కూర్చుని, ప్రఫుల్ల శరద్విభావరీ జ్యోత్స్నలో, ఆనంద రసాతిరేకంలో, మమతయొక్క మైకంలో కన్నయమైక ధానాయిక వీణవాయిస్తూ— ప్రియుణ్ణి తలుచుకుని, తన ప్రియుడిని ఆకాశరాజగు చంద్రునితో పోల్చుకుని విరహగీతి పాడుతూ, పూర్వానుభూతిని జ్ఞప్తి కెలయించుకుంటూండే సమయంలో ఆమె చెలికత్తె వచ్చి ఆమె తండ్రి మరణవార్త చెబుతుంది. అప్పుడు ప్రణయంలో నుంచి శోకంలోకి ముఖ భంగిమ మారాలి వెంటనే-ఎంతో ఆర్ద్రంగా నటించాలి ఆ ఘట్టంలో! తను వీణ వాయించనక్కరలేదు. వాయిస్తున్నట్లు నటిస్తూ చందమామను చూడటం. అదొక చక్కని పోజని చెప్పాడు దర్శకుడు. ఆ పోజును సాధన చేస్తోంది నిర్మల నిలువుటద్దం ముందు ఉదయం తొమ్మిది గంటలవేళ! హిందీ తారలు నసీం, సురయ్యా, శశికళ, మధుబాల మొదలైనవాళ్ల పోజులున్న సినిమా పత్రికలన్నీ తిరగేసిచూసి వాళ్లను అనుకరించాలని ప్రయత్నిస్తున్న సమయంలో దర్శకుడు సుకుమార్ కారులో వచ్చాడు సూటుతో-చేతిలో టాకీకి సంబంధించిన పెద్దపుస్తకంతో. డ్రైవరు ఆపిల్సు బత్తాయిలు, ద్రాక్ష, వున్న పండ్ల బుట్ట మేడ రెండో అండో అంతస్తులోకి సుకుమార్ వెంట తెచ్చి పెట్టి క్రిందికి వెళ్ళిపోయాడు.

బూట్ల చప్పుడు విని పోజులు విరమించి నిర్మల సుకుమార్‌ని చూచి "నేను చంద్రకాంత శిలావేదికమీద ఎలా కూచోవాలో ఇందాకటినుంచీ అనేక విధాల ప్రయత్నిస్తున్నాను" అన్నది.

"ఏదీ ఒక పోజు పెట్టు- నే చూస్తాను" అని అర్థించాడు దర్శకుడు. నిర్మల ఎన్నో రకాల పోజులు పెట్టింది: సుకుమార్‌కు ప్రతి పోజూ ప్రతిభావంతంగా కన్పించింది.

"నిర్మలా! నీవింత తెలివి గలదానివనుకోలేదు. నీ పోజులన్నీ బాగున్నాయి. ఏ యాంగిల్‌లోనైనా నీ సౌందర్యం చక్కగా కన్పిస్తోంది. త్వరగా బైలుదేరాలి. ఇప్పుడు రిహార్సల్ వుంది" అన్నాడు సుకుమార్.

"నేను రెడీగానే ఉన్నాను. ఈ పళ్లు ఆరగించి వెళదాం" అని ఆపిల్సు ముక్కలుచేసి ఒక ప్లేటులో పెట్టి అతని ముందుంచింది. అతనూ తనూ అనే భేదం యెరగని మమతతో అతని యెంగిలి తను దిని, తన యెంగిలతనికి పెట్టి- తమ ఏకత్వాన్ని నిరూపించుకుని ఇద్దరూ కారులో స్టూడియోకు వెళ్ళారు.

* * *

స్వంత స్టుడియో కానందున సుకుమార్ తను తీస్తున్న "పాలపొంగు"" చిత్రం విషయంలో అక్కడి టెక్నీషియన్సుతో చాలా యిబ్బంది పడుతున్నాడు. ఫొటోగ్రాఫర్ జర్మనీవాడు. ఇంగ్లీషు వచ్చు గాని అతను మాట్లాడే భాష సుకుమార్‌కి సులభంగా అవగాహనవడం లేదు. సుకుమార్ కూడా పెద్ద డిగ్రీ కలవాడు కాదు. కాని ఇంగ్లీషు మాట్లాడగలడు. సహాయదర్శకుడు బి. ఏ. ప్యాసయినవాడు, కావడం వలన ఫొటోగ్రాఫర్‌తో మాట్లాడగలుగుతున్నాడు. ఈ చిత్రం ప్రారంభించినది మొదలూ, ఫొటోగ్రాఫర్‌కు నిర్మల నటనేమీ నచ్చడం లేదు. ఫొటోగ్రాఫర్ సహాయం సరిగా లేకపోతే టాకీ సరిగా వుండటం దుర్ఘటం!

దర్శకుడు సుకుమార్ రిహార్సల్ రూమ్‌లోకి వెళ్ళి సహాయ దర్శకుడు రామారావుతో "రామారావూ! రిహార్సల్ ప్రారంభిద్దామా? చెలికత్తె వచ్చిందా?" అన్నాడు.

"ఇంకా రాలేదు. వచ్చే వేళయింది. ముందు కథానాయికకు ట్రెయినింగ్ ఇవ్వాలి! ఆమె విషయం చూద్దాం!" అన్నాడు రామారావు.

రిహార్సల్ రూమ్‌లో, నిర్మల ఒక పోజు

పెట్టి కూర్చొని పాటపాడింది. పాట సరిగా లేదని సంగీత దర్శకుడు నిర్మలచేత మళ్ళీమళ్ళీ పాడించాడు. ఆసమయంలో అక్కడికి ఫొటోగ్రాఫర్, సౌండ్ ఇంజనీరు వచ్చి అడిగారు "షూటింగుకు టైమయింది. మీ రిహార్సల్ పూర్తయిందా?" అని.

దర్శకుడు రిహార్సల్ పూర్తయినట్లు ప్రకటించాడు. ఇంతలో చెలికత్తె వేషంవేసే చంద్రిక కూడా స్టూడియోకు వచ్చింది! ఆమె అంతకు ముందు కొన్ని చిత్రాలలో నటించి వుండటం వల్ల ఆమెకు రిహార్సల్ అవసరంలేదు. పైగా ఆమెకూ ఫోటోగ్రాఫర్‌కూ పరిచయముంది. ఆమె అనేక పర్యాయాలు దర్శకత్వం విషయంలో సుకుమార్‌కు సలహాలు చెప్పింది. నిర్మల ఎలా పోజు పెడితే రసవంతంగా వుంటుందో ఆమె తానలా చేసి చూపకలిగేది. అదే పోజు నిర్మలకు చేతనయేది కాదు. దర్శకుడు సుకుమార్, తన నిర్మల ప్రప్రథమంగా గొప్పగా నటించలేకపోయినా- ఆమె శరీరావయవ సౌందర్యం రకరకాల యాంగిల్సులో చక్కగా చూపగలిగితే- అందువల్ల చిత్రానికి ధనార్జన బాగా ఉంటుందని నమ్మాడు.

చంద్రకాంత శిలావేదిక సెట్టింగు శోభాయమానంగా అమర్చారు. నిర్మలా - చంద్రికా మేకప్పులు పూర్తయినయి. నిర్మల మేకప్‌లో కొద్ది లోపాలుంటే చంద్రిక వాటిని సరిచేయించింది. తనకా చిత్రంలో వచ్చే రాబడి కొన్ని వందల రూపాయలైనా, చంద్రిక అయాచితంగా నిర్మల విషయంలో శ్రద్ధ వహించసాగింది. నిర్మల సౌందర్యం ప్రేక్షకులకు కన్నుల విందుగా వుండగలదని చంద్రికకు కూడా నమ్మకం కలిగింది. నిర్మల పట్టణ వాతావరణంలో ఆధునిక నాగరికతా ప్రభావంతో తన యౌవన సౌందర్యశోభను కోల్పోక, ప్రతి అవయవం తీర్చిదిద్దినట్లుగా అజంతా చిత్రాలలోని స్త్రీల సౌందర్యాన్ని ధిక్కరించే మించుబోడిగా కన్పించుతుంది.

సుకుమార్ "నిర్మలా! నువ్వింతదాక నీ యింట్లో పెట్టిన పోజుల్లో ఒకదానిని పెట్టు!" అన్నాడు సెట్టుమీదికి పోతున్న నిర్మలతో.

ఆమె చంద్రకాంత శిలావేదికమీద వీణ చేతిలో పట్టుకుని- చంద్రుడ్ని చూస్తూ ఒక పోజు పెట్టింది. ఆ పోజు చంద్రికకు నచ్చలేదు. ఆ పోజువల్ల నిర్మల సౌందర్యం ఛాయాగ్రహణంలో సరిగా కన్పించదని ఆమె తెలుసుకొంది.

"డైరెక్టరుగారూ! ఆపోజు బావుండలేదు" అన్నది చంద్రిక.

"బాగానేయుంది! నా కంటికి బాగున్నది నీకంటికి బాగుండటంలేదు మొదటి నుంచీ. రామరావ్! నిర్మల పోజు బాగుండలేదూ?" అని ప్రశ్నించాడు దర్శకుడు తన సహాయదర్శకుణ్ణి.

"సెక్స్ అప్పీలుగాలేదు! పోజు మారిస్తే బావుంటుంది!" అనిసలహానిచ్చాడురామారావు.

చిత్రంయొక్క విజయం నిర్మల సౌందర్య ప్రదర్శనంమీదనే ఆధారపడి వుందన్న విషయం సుకుమార్‌కు స్ఫురించింది. వెంటనే నిర్మలను మరి కొన్ని పోజులు పెట్టమన్నాడు!

"ఈ సీనులో నిన్నూ, నీ సౌందర్యాన్ని చూడడానికి ప్రజలు మరల మరల వస్తారు 'పాలపొంగు' చూడడానికి!" అన్నాడు సుకుమార్-నిర్మల తన వక్షోజోల్బణాన్ని ప్రదర్శిస్తూ పెట్టిన ఒకపోజు చూచి.

"నిర్మలమీద మీకుండే ప్రేమ మిక్కుటం కావటంవలన ఆమె ఏ పోజుపెట్టినా, ఎలా మాట్లాడినా మీ కానందంగా తృప్తికరంగా వుంటుంది. మీరు సంతృప్తిపడితే చాలదు. ప్రేక్షకుల నాకర్షించే విధానం మీ రాలోచించాలి!" అన్నది చంద్రిక.

దర్శకుడికి కొంత అవమానం కలిగింది. ఆగ్రహం వచ్చింది పదిమందిలో తన ముఖాన ఆమె అలామాట్లాడటంవల్ల. కాని చంద్రిక యథార్థమే మాట్లాడినట్లుగా అతని అంతరాత్మ ప్రబోధించింది. అంతట దర్శకుడు "చంద్రికా! నీవో పోజుపెట్టి చూపించు!" అన్నాడు.

నిర్మల సెట్టుమీదినించి ఈవలకు వచ్చింది. చంద్రిక చంద్రకాంత శిలావేదికమీద కూర్చొని ఒక చక్కని పోజు పెట్టి—

"నేనెంత రొమ్ము విరిచి కూర్చున్నా-నా వల్ల చిత్రానికి అందముండదు. కాని నిర్మల వంటి దృఢకాయురాలు, సౌందర్యవతి ఇప్పుడు నేకూర్చున్న విధంగా కూర్చుంటే ఎంతో

బావుంటుంది!" అన్నది. దర్శకుడు నిర్మలచేత చంద్రిక చూపిన పోజు చాలా శ్రమపడి పెట్టించాడు. ఫొటోగ్రాఫర్ లైట్లు వేయించి కెమెరా నడిపాడు.

"ఓ క్లోజప్ కూడా తీయించండి డైరెక్టరుగారూ!" అన్నది చంద్రిక. తరవాత నిర్మల కా పోజులో క్లోజప్పు తీయడమయింది కాని ఆ సీనులో పాట, వచనం అయింతరవాత చెలికత్తె వచ్చి మరణ వార్తను చెప్పగానే నాయిక ముఖంలో హఠాత్తుగా వుబికిరావలసిన శోకం రాలేదు. దర్శకుడు-ఫొటోగ్రాఫర్, చంద్రిక అందరూ ఎన్నో విధాల చెప్పారు ముఖం ఇలా పెట్టాలి అని. కాని నిర్మల మనసు పనిచేయడం మానేసింది. ఏవేవో పోజులు పెట్టింది. దర్శకుడికి తృప్తికలగలేదు. ఏవిధంగానూ నిర్మల ప్రణయ భావనా వీథిలోనుంచి శోకంలోకి మారడం సాధ్యం కాలేదు. అయినా ఎన్నో రీటేకులు తీశారు. లాభం లేదనుకుని ఊరుకోవడానికి వీల్లేక తీసిన సీను సరిచూసుకుని మరల షూట్ చేద్దామని ఆ పూట కాసీను అసంపూర్తిగా ఆపేశారు. నిర్మల ముఖం చిన్నబుచ్చుకోవడం చూచి దర్శకుడు ఆమెని ప్రయివేటుగా అడిగాడు: "ఏం అలావున్నావు?"

"నేను త్వరగా యింటికి పోవాలి. నాకు తలకాయ నొప్పిగానుంది! మీరుకూడా వస్తే మంచిది!" అన్నది నిర్మల.

"ఇప్పుడింటికి దేనికి? రెండుగంటల కాసీను షూటింగుంది. డాక్టరును ఫోను చేసి పిలిపిస్తాను. ఇవాళ షూటింగు లేకపోతే మన కెంతడబ్బో నష్టం!" అన్నాడు దర్శకుడు.

"ఈ చిత్రానికి దర్శకత్వం చేసేది మీరా లేక చంద్రికా? ఆ విషయం మీరు తేల్చుకుని చెబితే నాకు నటించడానికి వీలున్నదీ లేనిదీ చెబుతాను!" అన్నది నిర్మల కోపంతో.

"దర్శకుణ్ణి నేనే! ఇతరుల సలహాలు కూడా తీసికోవడంలో దోషంలేదు! ఆమె సినిమా అనుభవంకలది. ఆమె మనకు మంచి సలహాలే చెబుతోంది! నేనా ఈ పరిశ్రమకు కొత్తవాణ్ణి! ఇందులో దిగకముందు టాకీకి దర్శకత్వం చేయడం నాకు తెలుసనుకున్నాను. కాని నిజంగా ఇది చాలా కష్టమైనపని ఆమె సలహాలు మనటాకీ బాగుండేలాగున తయారు కావాలనేగాని అన్యంకాదు!" అన్నాడు సుకుమార్.

నిర్మలకు కోపం మరీ ఎక్కువైంది.

"అంతమందిలో మిమ్మల్ని పరాభవించే మాటలంది! మీకు కాస్తకూడా అభిమానం వేయలేదు. నాకు చాలా కష్టంవేసింది. మీ రామె సలహాలు షూటింగుకు ముందు రిహార్సల్ లోనే పొందడం మంచిది. లేదా మీ రామె ఇంటికిపోయి ఆమెవద్ద దర్శకత్వంలో పాఠాలు చదివి తరవాత ఈ చిత్రం కొనసాగించడం మంచిది. తానేమో రిహార్సల్ కు రాదు. సరిగా షూటింగ్ వేళకువచ్చి మిమ్మల్నీ-నన్నూ అల్లరిపాలు చేస్తున్నది" అన్నది నిర్మల.

"నీవలా భావించకూడదు. స్టూడియో పరిస్థితులు నీ కర్థం కాలేదల్లేవుంది. ఫొటోగ్రాఫర్ దానివాడు. దానికి అరవం, హిందీవచ్చు. వాడికీ అరవం, హిందీ వచ్చు. దానిమాట మనం విననట్లు కన్పిస్తే—అది ఫొటోగ్రాఫర్ తో చెప్పి-చిత్రాన్ని పాడుచేయిస్తుంది! తెలిసిందా? కనక దాని సలహాలు స్వీకరించక తప్పదు!" అన్నాడు దర్శకుడు సుకుమార్.

"అలా అయితే ఇక నేనీ టాకీలో నటించను!" అన్నది నిర్మల.

"నిర్మలా! ఆలోచించి మాట్లాడు! ఇందువల్ల నీ భవిష్యత్తు అంతా పాడవుతుంది! నేనీ టాకీ కోసం పెట్టిన ధనమంతా వ్యర్థమౌతుంది! బాగా ఆలోచించు!" అన్నాడు దర్శకుడు.

"కారుమీద నన్నింటికి పంపించండి! నాకు శరీరంలో బాగా లేదు. నేనిక ఇవాళ షూటింగ్ కు రాలేను!" అన్నది నిర్మల.

నిర్మలను ప్రాధేయపడి బ్రతిమలాడడానికి స్టూడియో తగిన ప్రదేశం కాదని ఆ రోజుకు షూటింగ్ లేదని సహాయ దర్శకుడితో చెప్పి, నిర్మలను కారులో ఎక్కించి ఆమె యింటికి వెళ్ళాడు దర్శకుడు సుకుమార్.

* * *

"మన ఇద్దరి భవిష్యత్తు ఈ చిత్రంమీద ఆధారపడివుంది. నీకీ చిత్రంతో కీర్తి వస్తే-నీవీ పరిశ్రమలో లక్షలు గడించే అవకాశం ఏర్పడుతుంది. ఈ కాస్త విషయానికే నీ వాగ్రహించి

ప్రయోజనం లేదు! చంద్రికమాత్రం ఏమన్నది? మీద నాకు ప్రేమఅధికమంది. అది అబద్ధమా’’ అని సుకుమార్ నిర్మలను సమాధానపరచడానికి ప్రయత్నించాడు సోఫాలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ.

“సినిమాలో నటించడం నాకు కొత్తయే గాని అందరూ టాకీలు మీ మోస్తరుగా దాసీ వేషం వేసేదాని సలహామీద తీస్తున్నారంటే నేను నమ్మను. దర్శకత్వానికి మీరిద్దరుండి ఏం ప్రయోజనం? మీ పురుషత్వం ఏమైపోయింది? ఒక ఆడదాని సలహా తీసికొనే అధమత్వం మీకు కలిగింది. షూటింగ్ సమయంలో మీరు తప్ప ఇతరులు సలహా లివ్వడానికి వీలు కాకుండా మీరందర్నీ శాసించాలి!’’ అన్నది నిర్మల.

“నీవిలా భావిస్తావని నే నెన్నడూ అనుకోలేదు. మన చిత్ర విజయానికయాచితంగా తోడ్పడేవారిని మనం అపార్థం చేసుకోకూడదు. చంద్రిక నీ విషయంలో మంచి సలహాలు చెబుతోంది. నీ భవిష్యత్తుగూర్చి ఆమెకు నమ్మకముంది!’’ అన్నాడు దర్శకుడు.

“ఆమె సలహాలవల్ల మనటాకీ విజయవంతమౌతుందనుకొనడం పొరబాటు. ఆమె సలహాలు మీరు స్వీకరించి బోధించండి. అంతేగాని షూటింగ్ సమయంలో ఆమె మాట్లాడకూడదు’’ అన్నది నిర్మల.

“పోనీ ఆమెనిక్కడికి తీసుకురమ్మంటావా? ఈ సీనులో ఎలా నటించాలో నీకామె నేర్పుతుంది’’ అన్నాడు సుకుమార్.

“ఆమె రాదు. తాను నాకంటె గొప్ప నటి అని చంద్రిక అభిప్రాయం! పైగా మీరు చెబుతున్నట్లు, ఆమెకి స్టూడియోలోఅందరితో బాగా పరిచయముంది’’ అన్నది నిర్మల.

సుకుమార్ ఆలోచనలో మునిగాడు ఏమీ పాలుపోక.

“చంద్రిక నిక్కడికి తీసుకవస్తాను. ఈ సీను వెంటనే తీసేయకపోతే సెట్టింగు మరల తయారుచేయవలసి వస్తుంది’’ అని దర్శకుడు చంద్రికయింటికి వెళ్ళాడు.

చంద్రిక నిద్రనుండి మేల్కొని తలుపు తెరచి చూసి మిక్కిలి ఆశ్చర్యపోయింది.

“ఏమిటి విశేషం? రండి లోపలికి’’ అని దర్శకుడిని ఆహ్వానించింది చంద్రిక. ఫ్లాస్కులోనున్న కాఫీ అతనికో కప్పులోపోసి యిచ్చి, తానొక కప్పుతో త్రాగుతూ – “ఇవాళ నిర్మలకు చాలా కోపంవచ్చిందని స్టూడియోలో అనుకున్నారు’’ అన్నది.

“సెట్టుమీద నుండగా మనం సలహాలు చెప్పడంకంటె, ముందుగా రిహార్సల్‌లో బాగా తయారుచేయడం మంచిది. చంద్రకాంత శిలావేదికమీద ఎలా నటించాలో మన మివాళ నిర్మలకు ట్రెయినింగ్ నిద్దాం. రిహార్సల్ సరిగా లేకుండా తీరా షూటింగ్ వేళ మనం ఆమెకు రకరకాలసలహాలు ఇస్తూంటే-ఆమెకు విసుగ్గా వుంది! నువు కూడా వస్తే నిర్మలకు ఇంటివద్దనే రిహార్సల్ ఇద్దాం!’’ అన్నాడు దర్శకుడు.

“నాతప్పు గ్రహించాను. అసలీ విషయంలో నా జోక్యం దేనికి? మీరు దర్శకులు. మీరే మీకు తోచినరీతిని తయారుచేయండి. నే నామె యింటికి రాను. మీరామెను స్టూడియోకు తీసుకరండి! అక్కడే రిహార్సల్ పెడదాం!’’ అన్నది చంద్రిక.

“రిహార్సల్ ఆమె యింటివద్ద నయితేనే బావుంటుంది. స్టుడియోలో చాలా మంది వుంటారు’’ అన్నాడు దర్శకుడు.

“నా ఎగ్రిమెంటులో నేనీపని చేస్తానని అంగీకరించలేదు!’’ అన్నది చంద్రిక.

“ఎగ్రిమెంటులో లేకపోతే ఫరవాలేదు. నీ వనుభవంగల దానివి. నీ సలహాలు చిత్రాన్ని మెఱుగుపెట్టేవేగాని పాడుచేసేవి కావు. నాయందు దయవుంచి నిర్మల యింటికి పోదాంరా. నీకేం భయంలేదు. నీ శ్రమకు తగిన పారితోషికం నేను ముట్ట చెబుతాను’’ అని దర్శకుడామెని చివరకు ఒప్పించగలిగాడు. ఇరువురు కలిసి కారులో నిర్మల యింటికి వచ్చారు.

నిర్మల చంద్రికనుచూచి పలకరించక అయిష్టంతో, కోపంతో చూచింది.

“రిహార్సల్ ఇక్కడే చేద్దాం! చంద్రికను బలవంతంమీద తీసుక వచ్చాను’’ అన్నాడు దర్శకుడు.

“సరే కానివ్వండి!’’ అన్నది నిర్మల.

“ఇంట్లోనున్న ఒకబల్లయే, చంద్రకాంత శిలావేదికగా భావించి, నిర్మల వచనంచెప్పి

చంద్రుణ్ణి చూస్తూ తన్మయత్వంలో వుండగా, చంద్రిక తన మాటలు చెప్పింది. ఇక వెంటనే నటించవలసిన పద్ధతి నిర్మలకు తోచలేదు.

"చంద్రికా! నీవే ఆ పాత్రగా భావించి ఎలా చేయాలో నటించి చూపమ్మా!" అని దర్శకుడు ప్రాధేయపడి అడిగాడు చంద్రికను.

చంద్రిక తనకు తోచినరీతి నటించి- కొన్ని మాటలు నిర్మల అనవలసినవి అన్నది. నిర్మల తదేకదృష్టితో చంద్రిక ముఖభంగిమను తిలకించింది గాని, తాను చేయబోయేసరికి, తనకు కుదరలేదు. చంద్రిక సలహాగా అన్నది: "ఆ సమయంలో శోకవదనం పెట్టాలంటే మీ ఆత్మ బంధువులలో ఒకరు చనిపోయినట్లు భావిస్తే, వెంటనే నీవు చక్కగా శోకంతో నటించగలవు!"

ఆమాటలు విని, అమాయికంగా నిర్మల కోపంతో- "మావాళ్లు అంతా బాగుంటే చచ్చిపోయినట్లు నే నెందుకనుకోవాలీ? నీ వాళ్ళందరూ చచ్చారని నీవనుకో!" అని టేబిల్ మీదనున్న గాజు గ్లాసును విసిరివేసింది చంద్రికమీద. చంద్రిక ముఖంమీద గ్లాసు పడి పగిలి, గాజుపెంకుల మూలంగా, గాయమయి రక్తం కారనారంభించింది! సుకుమార్ చాలా అలజడిపడ్డాడు. వెంటనే తన జేబుగుడ్డతో ఆమె రక్తాన్ని తుడిచి, కారులో డాక్టరింటికి తీసుకవెళ్లాడు.

"మీరు సాక్ష్యం చెబితే ఆ పాడు ముండ మీద ఛార్జి పెడతాను. నేను దానింటికి రానంటే, నన్ను బలవంతంచేసి తీసుకవెళ్ళారు. మిమ్మల్నీ దాన్ని కలిపికూడా కేసు పెట్టడానికవకాశమున్నది!" అని కారులో ఏడ్వసాగింది చంద్రిక.

సుకుమార్ తన పర్సులోనించి అయిదువందల రూపాయిలు తీసి,

"ఇవిగో ఈనోట్లు తీసుకుని దాన్నీ నన్నూ క్షమించు. అది ప్రపంచ జ్ఞానంలేని గొడ్డు. అందంగా వుందని ఆశపడ్డాను. నీకీగాయం నయమయేదాకా షూటింగ్ జరగదు. నీవు నా గౌరవాన్ని కాపాడాలి. స్టూడియోలో ఎవరికీ ఈ విషయాన్ని తెలియనీయకూడదు. కాలు జారిపడ్డానని చెప్పు, ముఖాన గాయమేమిటని ఎవరైనా అడిగితే!" అని చంద్రికకు డబ్బిచ్చి ప్రార్థించాడు.

డాక్టరు చంద్రిక గాయం పరీక్షించి కట్టు కట్టాడు. వారంరోజులయినా పుండు మానక నానాటికీ అభివృద్ధి కాజొచ్చింది. ఆసుపత్రిలో చికిత్సకోసంచేరిందిచంద్రిక! ప్రతిదినంసుకుమార్ వెళ్ళి, ఆమె ఆరోగ్యం గురించి విచారించేవాడు. వైద్యుడికి చాలా డబ్బిచ్చాడు. వైద్యుడా చీముపట్టిన కురుపు ఆపరేషన్ చేయాలన్నాడు. అందువల్ల ముఖం వికృతం అవుతుందన్నాడు.

"ఆపరేషన్ చేయడంవల్ల ముఖాన గుంట పడుతుంది. పెద్ద మచ్చ ఏర్పడుతుంది!" అన్నాడు డాక్టరు.

రెండు మాసాలకుగాని, ఆమె హాస్పటల్ నుంచి విడుదల కాలేదు.

సుకుమార్, చంద్రిక సినిమాలో నటించడానికి పనికిరాదని నిశ్చయించుకుని, ఆమె కంట్రాక్టు తాలూకు సొమ్ము ఇచ్చేశాడు! కాని ఆమెచేత కాగితం వ్రాయించుకుని తీసుకోలేదు.

చంద్రిక ఆరోగ్యం బాగుపడిన తరువాత ప్లీడరు సలహామీద ఫిలిం కంపెనీమీద యాభై వేల రూపాయలకు దావా వేసింది.

సుకుమార్ చంద్రిక బదులు మరొకతెతో ఫిలిం పూర్తి చేశాడు. విడుదల చేయించాడు. "పాలపొంగు" ఏ వూళ్ళోను వారం ఆడలేదు. పైగా చంద్రిక పెట్టిన కేసులో కోర్టు ఆమెకు 25 వేల రూపాయలు ప్రొడక్షను వారు చెల్లించాలనీ, ఆమెముఖం వికృతం కావడానికి దర్శకుడే కారణమనీ, ఆమె భవిష్యత్తంతా అందువల్ల పాడయిందనీ తీర్పునిచ్చింది.

సుకుమార్ తీసిన చిత్రానికి డబ్బురాలేదు. పైన చంద్రికకు కంపెనీవారు 25 వేలు చెల్లించడంతో సుకుమార్ ఆస్తి అంతా పోయింది.

నిర్మల తాను గొప్ప నటికావడానికి స్టూడియోలో ఫొటోగ్రాఫర్, ఇంగ్ల్ బర్గను ప్రేమించి అతనితోనుంటోంది! ఫొటోగ్రాఫర్ తన స్వంత ధనంతో ఆమెకు సంగీతం, నృత్యం మోటారుకారు నడపడం, గుర్రపుస్వారీ నేర్పిస్తున్నాడు. నిర్మల అతన్ని వివాహమాడడానికి కూడా అంగీకరించిందని వదంతి.